గుడుంబా తయారు చేయొద్దు


కురవి: స్వాధీనం చేసుకున్న బెల్లం పానకంతో డీఎస్పీ, ఎస్సైలు


గూడూరు: గోవిందాపురంలో దాడులు చేసి పట్టుకున్న గుడుంబా తయారీ సామగ్రి

● డీఎస్పీ తిరుపతిరావు

కురవి : ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు హెచ్చరించారు. గురువారం మండలంలోని మొగిలిచర్ల శివారు జగ్యా తండాలో నాటు సారా తయారీ కేంద్రాలపై కురవి పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడారు. గుడుంబాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సైలు బి.గోపి, అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సీరోలు మండలం కొర్లకుంట తండా గ్రామంలో సీరోలు పోలీసుల ఆధ్వర్యంలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు.

బయ్యారంలో..

బయ్యారం : మండలంలోని మిర్యాలపెంట పంచాయతీలోని చింతలతండాలో గుడుంబా స్థావరాలపై గురువారం గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై ఉపేందర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల గుడుంబాతో పాటు 1,500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

గుడుంబా తయారీ మానుకోవాలి

గూడూరు : గుడుంబా తయారీ, విక్రయాలు మానుకోవాలని గూడూరు సీఐ కె.బాబూరావు హెచ్చరించారు. మండలంలోని గోవిందాపురంలో గురువారం ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు గుడుంబా తయారీ, విక్రయ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. తయారీకి బాధ్యులైన మూడు చందు, మూడు సూక్యా, ధరావత్ స్వరూప, ధరావత్ నర్సింహాపై కేసు నమోదు చేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్ : మండలంలోని జోగ్యాతండాలో డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో పలు ఇళ్లు, వ్యవసాయ భూముల్లో తనిఖీలు నిర్వహించి సుమారు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు.

గార్ల : గుడుంబా స్థావరాలపై దాడి చేసి 15 లీటర్ల గుడుంబా, 500 లీటర్ల బెల్లం పానకాన్ని ఎస్సై ఎస్ జీనత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. చిన్నకిష్టాపురం పంచాయతీ దేశ్యా తండాకు చెందిన భూక్యా గోవర్ధన్, గుగులోత్ వీరన్నపై కేసు నమోదు చేశారు.

కేసముద్రంలో..

కేసముద్రం : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

నెల్లికుదురు : మండలంలోని సంధ్య తండాలో గుడుంబా స్థావరాలపై గురువారం పోలీసులు దాడా చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. గుగులోత్ కమల, బానోత్ సరోజ, బానోత్ ధర్మల ఇళ్లలో సోదాలు చేసి 60లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 1,600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

దంతాలపల్లి : మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలోని గుడుంబా స్థావరాలపై దాడి చేసి 16 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

నర్సింహులపేట : మండలంలోని కౌసల్యదేవిపల్లి శివారు రూప్లాతండాలో గురువారం గుడుంబా స్థావరాలపై ఎస్సై గండ్రాతి సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 400 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంగారం : మండలంలోని జంగాలపల్లి శివారులో తనిఖీ చేసి 40 లీటర్ల పానకం ధ్వంసం చేసి, 20 కిలోల చక్కెర లభ్యం కాగా సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం బుర్హాన్‌పురం శివారు వాచ్యతండాలో గుడుంబా స్థావరాలపై మరిపెడ సీఐ హాథీరాం నాయక్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోడు సమస్యలు పరిష్కరించాలి

● ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహబూబాబాద్ రూరల్ : బయ్యారం మండలం కాచనపల్లిలో పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని డీఎఫ్ఓ బత్తుల విశాల్‌ను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే గురువారం డీఎఫ్ఓ, అటవీ అధికారులను కలిసి పోడు రైతుల సమస్యలపై వివరించారు. మిర్యాలపెంట ఎంపీటీసీ సోమేష్, కొయ్యగూడెం మాజీ సర్పంచ్ పూనం రమేష్, ఇల్లెందు మార్కెట్ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, గార్ల సొసైటీ చైర్మన్ దుర్గాప్రసాద్, మూల మధుకర్ రెడ్డి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కనకయ్య


కలెక్టర్‌తో ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల : స్థానిక సమస్యలపై జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, డీఎంహెచ్‌ఓ కళావతిని గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలను ఆయా శాఖల జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

‘ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి’

మహబూబాబాద్ అర్బన్ : కేసముద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి ఆత్మహత్య యత్నానికి కారణమైన విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్సీఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టి ఆర్సీఓ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ ఉద్దేశపూర్వకంగా విద్యార్థిని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గుగులోత్ సూర్యప్రకాష్, గందసిరి జ్యోతిబసు, నాయకులు సింహద్రీ, రాకేష్, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

నెహ్రూసెంటర్: ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ అన్నపూర్ణ, ఎస్ఈ జె.నరేష్ అన్నారు. విద్యుత్‌శాఖ జిల్లా సర్కిల్ రివ్యూ సమావేశం జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. డీఈలు పి.విజయ్, మధుసూదన్, హరిప్రసాద్, సునీతాదేవి, ఎస్ఏఓ సంతోష్‌కుమార్, సబ్ ఇంజనీర్లు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ లోక్అదాలత్

డోర్నకల్: డోర్నకల్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ కురవి సబ్ డివిజన్ ఏడీఈ రమేష్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి డోర్నకల్ సబ్ స్టేషన్‌లో లోకల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు లోకల్ కోర్టుకు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఏడీఈ కోరారు.

ఆలయంలో చోరీ

కురవి : సీరోలు మండల పరిధి జగ్యా తండా సమీపంలోని గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఆలయ నిర్వాహకుడు జయరాజ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని కాకతీయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మూడు బాలుచౌహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం బాలు చౌహాన్ బృందం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బాలు చౌహాన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

బెంచీలు తరలించడం సరికాదు

కురవి : మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, స్కూల్‌కు చెందిన బెంచీలను వేరే చోటుకు తరలించడాన్ని మానుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్ ఆవరణలో బెంచీలు వేరే చోటికి తీసుకెళ్లడాన్ని సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని, తాగునీరు, ఆట వస్తువులు లేకుండా పోయాయని తెలిపారు.

వ్యాసరచన పోటీలు

దంతాలపల్లి : కుమ్మరికుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రపంచంలో జనాభా పెరగడం వల్ల కలిగే అనర్థాలు, జనాభా పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

నోట్ బుక్స్ పంపిణీ

పెద్దవంగర : దాతల సాయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని మండల నోడల్ ఆఫీసర్ బుదారపు శ్రీనివాస్, హెచ్ఎం దేవదాస్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నవంగర ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ ఉపసర్పంచ్ పాకనాటి జ్యోతి సోమిరెడ్డి మనుమడి జన్మదిన సందర్భంగా నోట్ బుక్స్, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అలాగే కాన్వాయిగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, షూస్ అందజేశారు.

యోగాతో ఆరోగ్యం

దంతాలపల్లి : యోగాసనాలతో ఆరోగ్యంగా ఉంటారని ఉస్మానియా విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరాజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు యోగా ఫర్ హెల్త్, ఆంగ్లం ఫర్ వెల్త్ అనే వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగ వ్యక్తిత్వ వికాసం, ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు.

ప్రతీ కార్యకర్తకు న్యాయం చేయాలి

గార్ల : పార్టీ గెలుపునకు కృషిచేసిన ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి న్యాయం చేయాలని మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణ గౌడ్ కోరారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకొని గత అధికార బీఆర్ఎస్ పార్టీ దాడులను ఎదుర్కొంటూ కేసుల పాలైన కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు పూరీ జగన్నాథస్వామి రథయాత్ర

గార్ల : పూరీ జగన్నాథస్వామి రథయాత్రను రేపు(శనివారం) నిర్వహించనున్నట్లు శ్రీ రామదండు 108 కమిటీ సభ్యులు కమల్ అగర్వాల్ తెలిపారు. గురువారం స్థానిక వర్తకసంఘంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గార్లలో తొలిసారి పూరీ జగన్నాథస్వామి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

కేసముద్రం : మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను అన్నారం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ మేరకు ఎస్సారెస్పీ కాల్వను, వ్యవసాయ మార్కెట్‌ను, పోలీస్‌స్టేషన్, వారాంతపు సంత, ఎమ్మార్సీ భవనం, డీసీసీబీ, ఎస్‌బీఐని విద్యార్థులు సందర్శించారు. హెచ్ఎం మడుపు రవీందర్, బత్తుల శ్రీధర్, శ్రీనివాసశర్మ, సోని, స్వప్న ఉన్నారు.

15 ఇసుక ట్రాక్టర్లు సీజ్

నర్సింహులపేట : మండలంలోని కౌసల్యదేవిపల్లి, జయపురం శివారులో గల ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 15 ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

తొర్రూరు : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్ విమర్శించారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. కుమార్ మాట్లాడుతూ రైతులకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేటికీ ఆ హామీని అమలు చేయడం లేదన్నారు.

‘తొర్రూరు ఎస్సైని సస్పెండ్ చేయాలి’

తొర్రూరు : పాలకుర్తి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వాట్సప్‌లో పోస్టు పెట్టాడనే నెపంతో గిరిజన యువకుడిని చితకబాదిన తొర్రూరు ఎస్సై జగదీశ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమా నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని భోజ్యాతండా శివారు ఈదులకుంట తండాలో బాధితుడు మాలోత్ సురేష్‌బాబును ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు పరామర్శించారు. అనంతరం భీమా నాయక్ మాట్లాడుతూ...పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, ఆమె పీఏ విజేందర్‌రెడ్డిల తీరును నిరసిస్తూ సురేష్‌బాబు వాట్సప్‌లో పోస్టు పెట్టాడని, అదేదో దేశద్రోహంగా పరిగణిస్తూ ఎస్సై జగదీశ్ యువకుడిని స్టేషన్‌లో చిత్రహింసలకు గురి చేశాడన్నారు. ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు విధుల నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ పార్లమెంట్ ఇంచార్జ్ రాందాస్‌నాయక్, నాయకులు మంగీలాల్, శ్రీను నాయక్, ప్రవీణ్‌నాయక్, అరుణ్, శివవర్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలనపై దృష్టి సారించాలి’

మరిపెడ/నెల్లికుదురు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాపాలనపై దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మరిపెడ, నెల్లికుదురు మండల కేంద్రాల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 18న కురవిలో నిర్వహించే సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశాల్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మల్లె పాక యాకయ్య, మారగాని బాలకృష్ణ, పోగుల శ్రీనివాస్‌గౌడ్, అబ్దుల్ రషీద్, పోలేపాక వెంకన్న, నారాయణ, ఉప్పలయ్య, నాయకులు అజయ్ సారథిరెడ్డి, వెంకన్న, స్వామి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్మలజగ్గారెడ్డికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు



మహబూబాబాద్ రూరల్ : టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్‌గా తూర్పు నిర్మలజగ్గారెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పీరీల ఊరేగింపు



నెల్లికుదురు : మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో గురువారం పీరీల పండుగను ఘనంగా నిర్వహించారు. అలంకరించిన పీరీలతో డప్పుచప్పుళ్లతో వాడవాడలా ఊరేగించారు.

గురునాథరావుకు డాక్టరేట్



మహబూబాబాద్ అర్బన్ : మానుకోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పూరే గురునాథరావుకు ఆంధ్రప్రదేశ్ కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థి కేంద్రీకృత విధానంలో బోధన అభ్యాసం ఇన్ సర్వీస్ భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుల అవగాహనలు అనుభవాలు అనే పరిశోధనకు గురునాథరావుకు రాయలసీమ యూనివర్సిటీ వారు గురువారం డాక్టరేట్ ప్రకటించారు.

చికిత్స పొందుతున్న చిన్నారి మృతి


చార్లిక (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లిలో కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంద చార్లిక (6) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు. బాలిక తండ్రి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన రెడ్డిబోయిన రాజుపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించామని పేర్కొన్నారు.

అనారోగ్యంతో అడ్వకేట్..


జానకీరాములు (ఫైల్)

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం నీలికుర్తికి చెందిన సీనియర్ అడ్వకేట్ తొట్టి జానకీరాములు (68) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, మాజీ సర్పంచ్ గుడిపూడి శ్రీనివాసరావు, నల్లు సుధాకర్‌రెడ్డి, దిగజర్ల శ్రీనివాస్, తొట్టి సత్యం, శ్రీను ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..


లింగయ్య (ఫైల్)

దంతాలపల్లి : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నిదానపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గునిగంటి లింగయ్య (50) వృత్తిలో భాగంగా గురువారం సాయంత్రం తాటికల్లు గీసేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మోకుజారీ తాటిచెట్టుపై నుంచి జారిపడిపోయాడు. గమనించిన స్థానికులు ఇంటికి సమాచారం ఇవ్వగా, అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు స్థానికులతో కలిసి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి లింగయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతిడికి భార్య లక్ష్మీ, కూతుర్లు మమత, మౌనిక ఉన్నారు.

దాడి సరికాదు

తొర్రూరు : న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడం సరికాదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్వకొలను ప్రవీణ్‌రాజు అన్నారు. సిద్దిపేటలో న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఘనపురం రామకృష్ణ, ప్రతినిధులు వెంకన్న, నాగరాజు, యాకాంబ్రం, మధుసూధన్, రఘురాంరెడ్డి, అయిలోని, వెంకటేష్, నగేష్ పాల్గొన్నారు.

టీచర్లను నియమించాలి

కురవి : జిల్లాలోని పీఎస్, జెడ్పీ హైస్కూల్స్ లో కొరత ఉన్న పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ గురువారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రినారాయణ డీఈఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భద్రినారాయణ మాట్లాడారు. ఈనెలలోనే ఎఫ్ఏ–1 పరీక్షలు ఉన్న నేపథ్యంలో వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

ప్రభుత్వ భూమి పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ డేవిడ్

నర్సింహులపేట : మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి గురువారం పడమటిగూడేనికి వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ పరిశీలించారు. గ్రామంలో ఇంకా ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

నెహ్రూసెంటర్ : జిల్లాలో డీఆర్‌డీఏ, ఈజీఎంఎం ఉన్నతి కార్యక్రమంలో వంద రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో సర్టిఫికెట్లను గురువారం అందజేశారు. ఆర్‌ఎస్ఈటీఐ ద్వారా జ్యూట్ బ్యాగ్‌లో మరిపెడ నందు శిక్షణ ఇచ్చినట్లు, శిక్షణ పొంది ఉత్తీర్ణత సాధించిన మహిళలకు ఈ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ సెర్ప్ జయశ్రీ, అడిషనల్ డీఆర్‌డీఓ శాంతకుమారి, నళినినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా మున్సిపాలిటీ అభివృద్ధి

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

తొర్రూరు : ప్రణాళికాబద్ధంగా తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. అమృత్ పథకం కింద పట్టణ అభివృద్ధికి మంజూరైన రూ.27.42 కోట్ల పనులకు గురువారం డివిజన్ కేంద్రంలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రత్యేక నిధులు కేటాయించి పురపాలికలను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని, పరిశుభ్ర మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణ భవిష్యత్ అవసరాల దృష్ట్యా అంతర్గత రోడ్ల విస్తరణకు ముందస్తు ప్రణాళికలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కమిషనర్ శాంతికుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌రెడ్డి, డీఈ నవీన్, మున్సిపల్ ఏఈ రంజిత్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యే తప్పుడు లెక్కలు చూపించారు’


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్ : అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తన అఫిడవిట్‌లో తప్పుడు ఆస్తుల లెక్కలు చూపించారని బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా క్రమశిక్షణ తరగతుల కన్వీనర్ పాకనాటి దామోదర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో దామోదర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో మామిడాల యశస్విని రెడ్డి రూ.110 కోట్లు ఖర్చు చేశారని, ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు రూ.70 లక్షల ఖర్చు వరకు అవకాశం కల్పించిందన్నారు. లెక్కలు లేని ఈ ఖర్చులకు సంబంధించిన ఆస్తులు ఎక్కడివని, ఎమ్మెల్యే తన అఫిడవిట్‌లో చూపించిన దానికంటే ఎక్కువ ఆస్తులు ఉన్నాయని, ఎమ్మెల్యే దొంగ అఫిడవిట్ ఎన్నికల అధికారులకు సమర్పించారన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే దేవరుప్పుల, రాయపర్తిలో ఇసుక, క్వారీల దందాలు చేస్తున్నారని, అక్రమ వ్యాపారాలు చేస్తున్నారని చెప్పారు. కాగా ఎమ్మెల్యే అత్త ఝాన్సీరెడ్డి తొర్రూర్ మండలం గుర్తూరులో 70 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారని, ఫెమా చట్టం–1999 ఆదాయపు పన్ను చట్టం–1961 ప్రకారం భారత దేశంలోని వ్యవసాయ భూములను కొనుగోలు చేయాడానికి (ఎన్ఆర్ఐలు) నాన్ రెసిడెంట్లు అర్హులు కాదని, వ్యవసాయ భూముల కొనుగోలుపై చట్టం ప్రకారం ఇది నిషేధించబడిందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచి వెంకటేశ్వర్లు, ఒర్సు పద్మ, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, నాయకులు పల్లే సందీప్, నరేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలి


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

గార్ల : గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో వైద్యపోస్టులు భర్తీ చేసి స్థానికులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత డిమాండ్ చేశారు. గురువారం గార్ల సీహెచ్‌సీ ఎదుట ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రూ.5 కోట్లు వెచ్చించి సీహెచ్‌సీలో సకల సౌకర్యాలు కల్పించారు కానీ, డాక్టర్ల పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రాత్రి పూట ఒక్క డాక్టర్ సైతం ఉండక పోవడంతో అత్యవసర చికిత్సకు వచ్చే రోగులు నానాఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు, కలెక్టర్ స్పందించి ఆస్పత్రిలో నైట్ డ్యూటీ డాక్టర్‌తో పాటు వైద్యుల ఖాళీలను వెంటనే భర్తీ చేసి రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల నాయకులు అలువాల సత్యవతి, నాగమణి, మౌనిక, రమ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సుగంధద్రవ్యాల సాగుతో ఆర్థికాభివృద్ధి

మహబూబాబాద్ రూరల్: సుగంధ ద్రవ్యాలను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికావృద్ధి సాధించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జీనుగు మరియన్న అన్నారు. మండలంలోని మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఎంఐడీహెచ్ నిధులతో జిల్లాలోని ప్రధాన సుగంధ ద్రవ్యాల సాగులో అధునాతన సాంకేతికతపై గురువారం జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఎస్ఓ మరియన్న మాట్లాడారు. సుగంధ ద్రవ్యాల సాగుతో పాటుగా ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నారు. నల్లగొండ జిల్లా కీటక శాస్త్రవేత్త రాజు గౌడ్, మల్యాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు, వరంగల్ ఐటీసీ నుంచి దామోదర్, డాక్టర్ ఎస్.మాలతి, ఐకార్ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి, అక్షిత, భావన, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ పథకాలపై తప్పుదోవ పట్టించొద్దు’

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వ పథకాలపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తే ఖబర్దార్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన బీసీ కాంగ్రెస్ నాయకుల సమావేశంలో శంతన్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ ఇవ్వడమే కాకుండా రేషన్ కార్డులు, రెండు లక్షల రైతు రుణమాఫీ కోసం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కమ్మగాని కృష్ణమూర్తి, గంగాధరి బాలరాజు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమకారుడు గుంజె హన్మంతు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

నెహ్రూసెంటర్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ... దేశ జనాభా 500 కోట్లకు చేరిన రోజుకు గుర్తుగా 1989 నుంచి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. డీఎంహెచ్‌ఓ కళావతిబాయి మాట్లాడుతూ... నూతనంగా వివాహం జరిగిన దంపతులు కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి డాక్టర్ వెంకట్రాములు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లాకావత్, ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, డాక్టర్ వైదేహి, బిందుశ్రీ, శ్రవణ్, విజయ్‌కుమార్, ప్రసాద్, రవీందర్‌రావు, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ బాధితులకు న్యాయం చేయాలి

మహబూబాబాద్: నీట్ బాధితులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బి.మధు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు టి.వీరభద్రం, జిల్లా కార్యదర్శి బి.చైతన్య డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది నీట్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలన్నారు. నాయకులు నాగరాజు, మహేష్, విజయ్, గణేష్, దిలీప్, నితిన్, సురేష్, మహేందర్, రాజేందర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.